**పులికంటి సాహితీసత్కృతి కథల పోటీలో ప్రత్యేక బహుమతి పొందిన కథ**

శిశిర ఋతువు. ఉదయం ఎనిమిది గంటలైంది. వాతావరణం చలిచలిగా వుంది. స్నానపానాలు ముగించుకొని బయట వరండాలో పేపరు చదువుతూ కూచున్నాను.

ఇంటి ముందు విశాలమైన ఆవరణ. చుట్టూ కాంపౌండు, దానికి గేటు వున్నాయి. గేటుపైన ఇంద్రధనస్సులా అల్లుకొన్న బోగన్ విల్లాలు కనువిందు చేస్తున్నాయి. కాంపౌండు గోడనానుకొని మట్టి కుండీల్లో వరుసగా రకరకాల పూలమొక్కలు, క్రోటన్ మొక్కలు. నాలుగు కుండీల్లో ఎరుపు, తెలుపు గులాబీలున్నాయి. అన్నీ వాసనలేని పూలు. రాత్రి కురిసిన మంచుబిందువులు, ఉల్లి పొరలాంటి మంచు పొరను చీల్చుకొని పడుతున్న సూర్యకిరణాల్లో చెమ్కీ దారాల్లా మెరుస్తున్నాయి. మనోహరంగా ఉంది దృశ్యం.

ప్రతిరోజూ కనిపించే దృశ్యమే ఇది ఈ ఋతువులో.

వంటింట్లో సరోజ దోశెలు పోస్తున్నది. ఆ సువాసన వసందుగా వుంది. నేను తిన్నాను. ఇంకా ఆవిడ తినాలి, పనిమనుషులకు పెట్టాలి.

# భవబంధాలు

## 'ద్వారకా'

మా షాపులో పనిచేసే ఆచారి వచ్చాడు. సన్నగా, పొడుగ్గా వుంటాడు. సగం జుట్టు నెరిసింది. మూడురోజులుగా గడ్డం చేసుకున్నట్లు లేదు. లోతుకు పోయిన కళ్లు, పొడుచుకొచ్చిన ముక్కు. ఇస్త్రీ చెయ్యని ఉతికిన ప్యాంటు, ఫుల్‌షర్టు. జేబునిండా కాగితాలు. వాటిలో నిజంగా ఉపయోగపడే వెన్నో!

నమస్కారం పెట్టి, వినయంగా గుంజనానుకొని నుంచున్నాడు.

నిన్న మిగిలిపోయిన పని గురించి, ఇవాళ జరగాల్సిన పని గురించి వంగి వంగి, నంగి నంగిగా చెబుతున్నాడు. 'ధైర్యంగా మాట్లాడవయ్యా' అని ఎన్నిసార్లు చెప్పినా అతడంతే... అతని భయం అతనిది! 'మీరు పనిచేస్తున్నారు గాబట్టి డబ్బిస్తున్నాను. ఊరికే ఇవ్వడం లేదుగా!' అంటూ చాలాసార్లు చెప్పాను. పాతవాసనలు అతన్ని వదల్లేదు.

ఇంతలో గేటుదగ్గర నుదుటిమీద యాపిలు పండంత కుంకుమబొట్టుతో, ఐదడుగుల స్త్రీ మూర్తి కనిపించింది. వయసు యాభై దాకా వుంటుంది. తెల్లజుట్టు నున్నగా దువ్వుకొని వెనక కొప్పు పెట్టుకున్నది. బుగ్గలో వక్కాకున్నట్లుంది. చెవులకు దుద్దులు, ముక్కుకు ముంగర వున్నాయి. మెడలో నల్లపూసల దండ వుంది. వంగపండు రంగు చీరె కట్టుకొని తెల్లని జాకెట్టు తొడుక్కున్నది. చామనచాయ శరీరచ్ఛాయ. గేటు దగ్గర తారాడుతున్నది.

"ఆ మనిషెవరు ఆచారీ? ఏం కావాలో అడుగు" అన్నాను.

నా వంకే భక్తితో చూస్తున్న ఆచారి చూపులు గేటు మీదికి మళ్లాయి. అతని ముఖంలో చిరునవ్వు మెరిసింది. మెల్లిగా గేటు దగ్గరికి నడిచి ఆమెతో ఏదో మాట్లాడాడు. ఆవిడ వెళ్లిపోయింది. చిరునవ్వు చెదిరిపోకుండా ఆచారి దగ్గరికొచ్చాడు.

"గంగు, అప్పా! 'మా ముసిలోడింకా రాలేదా?' అని అడిగింది" చెప్పాడు ఆచారి.

"గంగెవరు? ముసిలోడెవరు?" ఆశ్చర్యంగా అడిగాను.

"అదేనప్పా! మన రహీం తాలూకు మనిషి" అన్నాడు ఆచారి.

"వీడేమో సాయిబు. ఆవిడేమో హిందూ స్త్రీలాగా వుంది. అతని తాలూకెట్లా అవుతుందయ్యా?"

"చాన్నాళ్లుగా ఆ మనిషి రహీముతో వుంటావుందప్పా!"

"దాన్ని వుంచుకున్నాడా?"

"ఏం పాడో నప్పా! వాడితోనే వుంటావుంది. నాకు తెలుసప్పా."

రహీం ఎవరో కాదు, నా దగ్గర పనిజేసే కంగాణం మనిషి. అరవయ్యేళ్ల వృద్ధుడు. బుర్ర మీసాలు, గిరజాల జుట్టు, తెల్ల లుంగీ, పొడుగు చేతుల జుబ్బా అట్టహాసంగా వుంటాడు. దాదాపు ఐదడుగుల పొడవుంటాడు. మనిషి బక్కపలుచనివాడే అయినా, జుబ్బాతో కాస్త లావుగా కనిపిస్తాడు. మంచి మాటకారి. ఖంగుమనే కంఠస్వరం. తెలివితేటలకు తక్కువేం లేదు.

పక్క వూళ్లలో మాకు రావాల్సిన అప్పులు వసూలు చేసుకొచ్చేందుకు పెట్టుకున్నాను.

మామూలుగా బయటకి పంపేప్పుడు రాను, పోను బస్సు ఛార్జీలకు, భోజనానికి డబ్బిచ్చి పంపుతూనే వుంటాను. రహీం మాత్రం ఖాతాదారు ఇంట్లోనే భోంచేసి, అతని దగ్గరే రాను, పోను అయ్యే బస్సు ఛార్జీలు

వసూలు చేసుకుంటూ వుంటాడు.

ఈ విషయం ఆచారే నాకు రెండు మూడుసార్లు చెప్పాడు. అయినా తెలిసీ తెలీనట్లు వూరుకుంటున్నాను. ఎందుకంటే నాలుగురోజులు ఆలస్యంగానైనా, రావాల్సిన బాకీలు ఖాతాదార్ల ముక్కు పిండి వసూలు చేసి ఖచ్చితంగా నా చేతిలో బెడుతుంటాడు. నా పని నమ్మకంగా చేస్తున్నాడు. అతణ్ణి తప్పులు పట్టాలనిపించలేదు. ఖాతాదార్ల దృష్టిలో నేను పలుచనౌతానని తెలుసు. అది వ్యాపారానిక్కూడా నష్టమే. మరో నమ్మకస్థుడు దొరికేదాకా ఇది తప్పదు.

"రహీం పెళ్లాం పోయి రెండేళ్లవుతుందప్పా! ఒంటిగానే వుంటూ వున్నాడు పాపం." అన్నాడు ఆచారి.

"అది నాకు తెలుసులేవయ్యా! వాడికి ముగ్గురు కూతుళ్లు. ముగ్గురుకీ పెళ్లిళ్లు చేశాడు. ఒక కూతురు మనూళ్లోనే వుంది..." రహీం కుటుంబ వ్యవహారాలన్నీ తెలిసినట్లు అన్నాను. "ఆ కూతురి దగ్గరుండగూడదూ? దీన్నొక దాన్ని ఎందుకు తెచ్చుకున్నాడు? ముసిలి మోపున ఈ



ఆటలెందుకు?"

"కూతురికి, వాడికి అస్సలు సరిపడదప్పా! రాయి టెంటాయ. దాని మొగుడు పెద్ద తాగుబోతు. పనీపాట జెయ్యడు. దుడ్లకో సందాన్ని ఏడిపిస్తావుంటాడంట. అదేవోఁ దుడ్లు గావాలంటూ ఈడి యంట బడతా వుందంట... దాన్ని ఇంటి ముందుక్కూడా రానీడప్పా!" అన్నాడు ఆచారి. "ఇప్పుడు వాడికి గంగు తోడుగా దొరికింది."

"ఇంతకూ ఆ గంగుది ఏ వూరుట?"

"తెలవదప్పా!"

"మనం అప్పులిచ్చిన మనుషుల తాలూకునా?" ఈ ఆలోచన రాగానే నా గుండె గుభేల్‌మన్నది. వాళ్ల ఇంట్లో కూచుని తింటూ మాటలతో చెల్లించి, బెదిరించి కొట్టుకొచ్చాడేమో? ఇదే ఆచారితో అన్నాను.

"లేదు లేదప్పా! ఇదెవతో కొత్తది. అట్టాంటి యవారమైతే దాని మొగుడు నీకాడి కొచ్చుండడా?" చాలా నమ్మకంగా చెప్పాడు ఆచారి.

రహీం, గంగుల సంగతి నాకింతవరకు తెలీదు. రోజుకైదుసార్లు మసీదులో 'నమాజు' చేసే రహీం గంగును చేరదియ్యడం ఆశ్చర్యంగా వుంది. అంత కావాలనుకుంటే వాళ్ల మనిషినే ఎవర్నయినా తెచ్చుకోకూడదూ? అంతా చిత్రంగా వుంది... ఆవిడ ఈ ముసిలోడిలో ఏం స్వారస్యం చూసిందో!... ఏదోలే, వాళ్ల ఏడుపేదో ఏడ్చుకుంటున్నారు. అనవసరంగా వాళ్లను గురించి ఆలోచిస్తూ నేను తలబద్దలు కొట్టుకోవడమెందుకు... వాళ్లు కలిసుండడంవల్ల, నాకు గాని, నా వ్యాపారానిగ్గానీ నష్టం ఏమీ లేదుగా?

***

సాయంత్రం ఏడుగంటలైంది. బాగా చీకటి వడ్డది. అంగడి సర్దేసి ఇంట్లోకి పోబోతున్నాను. రహీం నాముందుకొచ్చి నుంచున్నాడు.

"ఏం రహీం! డబ్బేమైనా ఇస్తావా?" అడిగాను.

"లేదప్పా! ఆ యాసామి ఇంకా నాలుగు రోజులు పోతేగాని కుదర్దన్నా డప్పా" అన్నాడు చేతులు కట్టుకొని.

"వాడి బాకీ, నీ ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. అక్కడికి ఇక్కడికి షికార్లు తిరుగుతున్నా వన్నమాట!" అన్నాను అతని ముఖంలోకి చూస్తూ.

"అట్టా అంటావేందప్పా! వా డియకపోతే నేనేం జేసేది? ఆడికీ గట్టిగా అడుగుతానే వుండానప్పా. వానల్లేవు, నీళ్లు లేవు. పొలాలు బీడు బడ్డాయి. జనం అల్లాడతా వుండారప్పా... మనిషి మంచోడే. మాటమీద నిలిచేవోడే. పాపం దుడ్లాడ్డం లేదు. ఏం జేస్తాడు పాపం! బయట ఆసాములు ఎన్ని బాధల్లో వున్నారో నీకు తెలీడం లేదప్పా!" గట్టిగానే అన్నాడు రహీం. అతడు నా ముందు ఆచారి లాగా భయపడ్డాడు.

"అక్కడికి నీ కొక్కడికే జనం బాధల గురించి తెలిసినట్లు!" కాస్త కోపంగానే అన్నాను అతని కళ్లలోకి చూస్తూ.

"జనంలో తిరగతా వుంటా గదప్పా! నేను జూసింది నీకు జెపతా వుండా. అంతేనప్పా. కోప్పడొద్దు" తలవంచుకొని వినయంగా అన్నాడు రహీం.

"నీ పని అప్పులు వసూలు చేసుకు రావడం గానీ, జనం కష్టాల గురించి తెలుసుకోడం కాదు గదా రహీం!" శాంతంగా అన్నాను.

"నాకు మాత్రం తెలవదా, అప్పా! వసూలు జేస్తా. ఈసారి దొడ్లో చెయ్యేసి లాక్కొస్తా. సూస్తా వుండు."




"సరేలే. నువ్వు పో." కుర్చీలోంచి లేచాను.

"దుడ్లు కావాలప్పా." నవ్వు ముఖంతో, తలగీరుకుంటూ అడిగాడు రహీం.

"ఉట్టి చేతుల్తో వచ్చావు. పైగా డబ్బు కావాలంటున్నావా? ఇప్పుడు లేవుపో."

"చానా జరూరు గుందప్పా. లేదనొద్దు."

"రేపొద్దున రా, చూద్దాం!"

"లేదప్పా, ఇప్పుడు గావాల. చానా జరూరు. లేకపోతే అడగను."

"ఇప్పుడు లేదన్నా గదా! ఉదయం రా, ఇస్తా!"

"ఇప్పుడే కావాలప్పా, ను వ్వియ్యాల."

ఇంతకు ముందెప్పుడూ ఇట్లా మొండి కెయ్యలేదు రహీం. ఏదో పెద్ద అవసరమే వచ్చి వుంటుంది. తిరిగి కుర్చీలో కూచున్నాను.

"ఎంత కావాలేంటి?" విసుగ్గా అన్నాను.

"మున్నూరు కావాలప్పా."

"మున్నూరా! పదో పరకో అయితే యిస్తా."

"కాదప్పా. మున్నూరు గావాల. జరూరుగా ఇప్పుడే గావాల."

"అంత పట్టు బడుతున్నావు! నీ కిప్పుడు అంత డబ్బెందుకు?"

"గంగు మొగుడికి సీరియస్‌గా వుందంటప్పా! ఆసపత్రిలో వున్నాడంట. మొగుణ్ని జూసేందుకు బోవాలంటా వుంది గంగు. అన్నం, నీల్లు లేకుండా యేడుస్తా వుందప్పా!"

"గంగు మొగుణ్ణొదిలేసింది గదా! నీ దగ్గరుంటూ వాడితో గూడా కాపరం జేస్తున్నదా?" కుతూహలంగా అడిగాను ఆశ్చర్యం కలిపి.

"చ చ. అదేం మాటప్పా. వాన్నొదిలేసి నాతోనే వుంటా వుంది. నేనంటే దానికి చానా యిష్టమప్పా. వాడితో సరివడ్లేదు. వొదిలొచ్చింది. నాకు పెళ్లాం లేదుగా. దరికి దీశాను." సిగ్గుపడ్డాడు రహీం.

"గంగంటే నీకూ యిష్టమేనా?"

"చానా యిష్టమప్పా! ఇద్దరూ ప్రేమించుకుంటా వుండామప్పా!" రహీం కళ్లల్లో చిలిపితనం, ఆనందం కదలాడాయి.

"ఈ ముసలితనంలో ప్రేమయేంటయ్యా!" గట్టిగా నవ్వాను.

"ముసిలోల్లు ప్రేమించగూడదా అప్పా?

ప్రేమకు వయసేందప్పా! ఎప్పుడైనా వస్తది. ఎప్పుడైనా వేస్తది. ఎప్పుడైనా పోతది. ఎప్పుడేం జరుగుతుందో ఎవుడికి దెలుసప్పా!"

ఈ ప్రేమ నిర్వచనానికి నాకళ్లు తిరిగాయి. పెళ్లిగాని పడుచు వాళ్లు ప్రేమించడం ఫలిస్తే పెళ్లి విఫలమైతే ఆత్మహత్యలు వీటిగురించి సినిమాల్లోనూ, చుట్టూ సమాజంలోనూ చూస్తూనే వున్నాం. ఇట్లా ముదిమిలో వున్న వాళ్లు గూడా ప్రేమలో పడ్డం చిత్రంగా అనిపించింది.

కాస్త స్థిమిత పడిం తరువాత

"బలే వాడివయ్యా! ఎప్పుడు బడితే అప్పుడు ప్రేమలోకి దిగుతే సంసారాలేం నిలుస్తాయి?" అన్నాను.

"నాకు పెళ్లాం లేదు. అది మొగుణ్ణొదిలింది. నాకాడ జేరింది. ఇద్దరం బాగున్నామప్పా ప్రేమగా!"

"దానికి బుద్ధి మాటలు చెప్పి మొగుడి దగ్గరకు పంపక నీతో వుంచుకోడం తప్పు గదూ?"

"నే జెప్పానప్పా. అ దిన్లేదు. నాకాడే యిష్టంగా వున్నది."

"ఊరికే వచ్చింది గదాని ఉపయోగించుకోడం తప్పు రహీం."

"నీకెట్లా జెప్పాలో తెలవడం లేదప్పా... ఆడది మొగాన్ని కలిసెందుకొప్పుకుంటే ప్రేమ. ఒప్పకుంటే 'రేపు'. అంతే కదప్పా న్యాయం! అన్నాడు రహీం.

"నీకు చట్టం గూడా తెలుసునన్నమాట!" అన్నాను.


"ఇట్లాంటియి ఇతర దేశాల్లో చానా జరగతా వుంటాయంట గదప్పా!" అన్నాడు రహీం.

"ప్రపంచ జ్ఞానం గూడా నీకు చాలా వుంది రహీం!"

"అంతా నీ పున్యమే నప్పా. ఆ వూరు ఈ వూరు దిరుగుతా, ఆడ ఈడ మాటలు యింటా తెలుసుకున్నా నప్పా!"

"సరే. ఆమె యిష్టపడి నీ దగ్గర కొచ్చింది. కలిసి వుంటున్నారు. ప్రేమించుకుంటున్నారు. బాగానే వుంది. కాని ఇప్పుడిదేంటి? దాని మొగుడికి సీరియస్సు, హాస్పిటలు ఇదంతా నీకెట్లా తెలుసు?"

"దాని కొడుకొచ్చి చెప్పాడప్పా. 'అయ్యకు సీరియస్‌గా వుంది. నిన్ను జూడాలనుందంట.



ప్రేమ-శాంతి సందేశాలు తీసుకెళ్లా!

అంటూంది గ్లామరస్ ఊర్మిళామాతోండ్కర్. ఇటీవల తండ్రితో కలిసి లాహోర్ వెళ్లింది. "లాహోర్‌లోని ఓ చోట తిరుగుతున్నప్పుడు, అచ్చంగా పాతఢిల్లీలో వున్నట్లే అనిపించింది. నాకు వాళ్లు చెప్పిన స్వాగతం చూసి మా నాన్నగారే కంట తడి పెట్టారు. జనం మంచివారే కానీ, వారి మనసుల్లో భారతదేశప్రజలు చెడ్డవారనే భావన నిండిపోయి వుంది. ఈ అపోహలను దూరం చేసుకుంటే, అందరం కలసిపోతామనే నమ్మకం నాకుంది. అందుకే నేను ప్రేమశాంతిసందేశాలతో అక్కడికి వెళ్లాను" అంటూంది ఊర్మిళ. మంచిదే కదా!

రమ్మన్నాడు.' అని దాంతో చెప్పాడంట. కబురిన్న కాడ్నించి ఏడుస్తా పడుంది. నాకు చానా బాదగా వుందప్పా."

"నీకు కూతుళ్లున్నారు. దానికీ కొడుకులూ, కూతుళ్లు వున్నారు... ఈ వయసులో ఇదేం పోగాలమయ్యా?"

"ఏందో లేప్పా. జరిగిందేదో జరిగింది. నువ్వన్నీ యివరంగా అడుగుతా వుంటే యిప్పుడేం జెప్పేది? ఏ దెందుకు జరుగుతాదో ఎవడికి దెలుసు నప్పా?... నువ్వు దుడ్లియ్యి" వినుగొచ్చింది రహీంకు.

"వదిలేసిన మొగుడు చస్తేయేం? బతుకుతే యేం? పోవద్దని చెప్పు."

"నే చెప్పానప్పా. దాని ఏడుపు జూస్తే కడుపు దరక్కపోతా వుంది."

"అందుకని డబ్బిచ్చి పంపేందు కొప్పుకున్నావా?"

"అది సస్తా వుంటే యేం జేసేదప్పా?"

"ఆమె తిరిగి రాకపోతే మీ ప్రేమ యేమయ్యేట్లు?"

అదట్టాంటిది గాదప్పా. కచ్చితంగా వస్తది."

"ఒకవేళ రాకపోతే మీ ప్రేమ గతేంటి?"

"నీకు నవ్వుతాలగా వుందప్పా! ... ఎంత జెడ్డా వాడు తాలి గట్టినోడు గదప్పా. వాడితో సంసారం జేసింది. పిల్లల్ని గన్నది... కడజూపు జూడాలని అల్లాడతా వుంది. వాడి కోరిక, దీని కోరిక దీరనియ్యి. ఏం బోతా వుంది?.... నువ్వు దుడ్లియ్యి." బతిమాలాడు రహీం.

అతని సెంటిమెం టతనిది. అనుకుంటూ రహీం చేతిలో మూడొందలు పెట్టాను.

"ముందే యిచ్చుంటే యేవప్పా? ఆకరి బస్సు గూడా పోయిందో యేవో." అంటూ పరుగున పోయాడు రహీం.

***

ఆ రోజుదయం మామూలుగా వరండాలో కూచున్నాను. ఆచారి ఇంకా రాలేదు. గేటు దగ్గర ఎవరో విధవరాలు తారట్లాడుతున్నది. ఆవిడను యింతకు ముందెప్పుడూ చూచిన జ్ఞాపకం లేదు.

ఇంతలో రహీం గేటు దగ్గర కనిపించాడు. ఆవిడతో ఏదో మాట్లాడి పంపించాడు. లోపలకొస్తున్నాడు గేటు తెరుచుకొని.

"ఆ మనిషెవరు రహీం?" అడిగాను.

"గంగప్పా! నాకోసం వెదుకుతా వుంది." తలవంచుకుని అన్నాడు రహీం.

"ఏమిటీ? గంగా? ముఖం మీద యాపిలు పండు, కమ్మలు, గాజులు...?" ఆశ్చర్యంగా రహీంను చూచాను.

"దాని మొగుడు పోయినాడప్పా! దాంతో అన్నీ తీసేసింది."

"మొగుడు పోయినా నువ్వున్నావు గదా! ఎందుకు తియ్యనిచ్చావు?"

"నేనున్నానప్పా. ఏం లాభం? తాలి గట్టినోడు పోయినాడు గదా! అందుకే అది తీస్తా వుంటే నేనడ్డం జెప్పలేదప్పా!"

"మనిషెంత సన్నబడిం దెందుకూ?"

"దిగులుతో తిండి తిండం లేదప్పా. ఏడుస్తా పడుకుంటది. వాన్ని మరిచిపొమ్మని నేనెంత జెప్పినా యినడం లేదప్పా!" ఇక ఆ విషయంగా మాట్లాడ్డం యిష్టం లేనట్లు పశువుల పాకలోకి పోయాడు రహీం.

మొగుడంటే అంత భక్తి, శ్రద్ధలున్న మనిషి, అసలు అతణ్ణెందుకు వదిలేసినట్లు? రహీంతో ఎందుకున్నట్లు? ఎంత ఆలోచించినా నాకు సమాధానం దొరకడం లేదు.

***

"గంగు చనిపోయిందప్పా!" చెప్పాడు ఆచారి.

"అవునా! ఎప్పుడు?" అడిగాను.

"మూడురోజులైందప్పా."

"అందుకేనా వారం రోజులుగా రహీం కనిపించడం లేదు.

"బలే సేవలు జేశాడప్పా. శవం ఊరేగింపు జరిపించాడు. పలకల వాళ్ల నేర్పాటు జేశాడు. రెండు బుట్టల పూలు, వంద రూపాయ ల్లాకా చిల్లర చల్లించాడప్పా. చానా గొప్పగా జరిపించాడు."

"ముస్లీములు ఇలాంటివన్నీ చెయ్యరు గదా ఆచారీ!"

"చనిపోయింది గంగుదప్పా. మన మనిషేగా. అందుకే మన పద్ధతి ప్రకారం అన్నీ జరిపించాడు." రహీమును బలే మెచ్చుకున్నాడు ఆచారి.

"చానా చేశాడన్న మాట!"

"వాళ్ల వాళ్లెవరూ తప్పుబట్టలేరా?"

"అదంతా నాకు తెలవదప్పా. రహీము గంగుకు సమాధి కట్టించాడు. దానిమీద 'గంగు' పేరుతో పాలిష్ రాయి గూడా వేయించాడప్పా. సమాధి ముందు ఒక చిన్న తులశికోట కట్టించి తులశి మొక్క నాటాడప్పా. పొద్దున, సాయంత్రం ప్రతి రోజూ నీళ్లు పోస్తున్నాడు."

"ఈ తులశి మొక్కు మొక్కడాలెందుకు ఆచారీ?"

"గంగు ప్రతిదినం తులశి మొక్కకు నీళ్లు పోసి, దానిచుట్టూ తిరుగేదంటప్పా. ఇట్లా జేస్తే గాని గంగు సంతోషించదంట!"

"ఇంకేం గంగు! ఆవిడ పోయిందిగా!"

"అదేనప్పా దాని ఆతమ."

"ఓరి వీడి...! రహీం సామాన్యుడిగా లేడు... ఆ సమాధి వగైరా చూస్తాను. నన్నూ తీసుకుపో ఆచారీ!"

"సాయంత్రం పోదామప్పా!"

***

అడుగులో అడుగేసుకుంటూ అస్థిపంజరంలా అయిన రహీం నా ముందుకొచ్చాడు. టవలు ముఖానికి అడ్డం పెట్టుకొని నేలమీద కూలబడి వలవల ఏడ్చాడు.

నేనతని దగ్గరికి పోయి ఓదార్చే ప్రయత్నం చేశాను.

"అంత బాధ పడ్డమెందుకు రహీం. నువ్వేం 'నిఖా' చేసుకోలేదుగా! మధ్యలో వచ్చింది మధ్యలోనే పోయింది. దానికింత ఏడవడ మెందుకు?" అన్నాను.

"దానికంటే నేను ముందు పోయుంటే బాగుండేదప్పా! ఎంత మంచి మనిషప్పా గంగు! నేనంటే ఎంత ప్రేమప్పా దానికి! అది మనిషి కాదప్పా! దేవత! ఎంత బాగా జూసుకుందో నన్ను... ఎట్లా మరిచిపోయేదప్పా!" ఏడుస్తూనే అన్నాడు రహీం.

"సమాధి కట్టించి, తులశికోట గూడా పెట్టించావుట గదా! అక్కడికి వచ్చి చూడాలని వుంది నాకు... ఆచార్ని గూడా పిలు, పోదాం." అన్నాను.

ముగ్గురం ఊరి వెలువల వున్న 'గంగు' సమాధి దగ్గరికెళ్లాం.

దానికంతా పసుపుపూసి, తలవేపు 'స్లాబు' మీద పెద్ద బొట్టు పెట్టాడు. నిజంగా నేను మొదటిసారి చూసిన గంగుమొఖం కనిపించింది నాకు. తులసి మొక్క నవనవలాడుతూన్నది.

ఏదో పవిత్రభావం చిత్రంగా నా మనస్సులో చోటుచేసుకున్నది. నా రెండు చేతులూ కదిలాయి. 'గంగు' సమాధికి దణ్ణం పెట్టాలో, రహీముకు దణ్ణం పెట్టాలో తెలీక పూరికే వుండిపోయాను.

ఐదు నిముషా లా చోట్లో గడిపాను. నేనక్కడికి పోయి నందుకో యేమో రహీం ముఖంలో సంతోషం కనిపించింది.

నేను, ఆచారి నిదానంగా ఇంటి ముఖం పట్టాను. తలవంచుకుని నడుస్తూంటే నా కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

"రహీము కూడా చాన్నాళ్లు వుండేట్టు లేదప్పా" అన్నాడు ఆచారి.

■

## బురకా వేసుకుని వెళ్లా!

'ఖ్వాహిశ్' చిత్రం హీరోయిన్ మల్లికాశరావత్, ఆ చిత్రం చూసేందుకు తన సోదరుడు, చిత్రనిర్మాత గోవింద్‌మేనన్‌లతో కలిసి బురకా వేసుకుని మరీ వెళ్లిందిట. "చిత్రం ప్రారంభం కాగానే ఈలలు మొదలయ్యాయి. తొలి చుంబనదృశ్యం కనిపించగానే జనం తెర మీదికి నాణాలు విసిరేశారు. పదిహేడు చుంబనదృశ్యాల్లో చేసిన నటిగా నాకు గుర్తింపు వచ్చింది. మన దేశంలో పెళ్లికి ముందు పురుషుడు స్త్రీలతో సంబంధం పెట్టుకుంటే, అదతని మగటిమిగా భావిస్తారు. అమ్మాయి అదే పని చేస్తే మాత్రం చరిత్రహీన అని నిందిస్తారు. ఇది నాకు నచ్చని విషయం. గోవింద్‌మేనన్ తీసే రెండో చిత్రంలోనూ నేనే నాయికను. ఆ చిత్రం ఇంకా బోల్డ్‌గా వుంటుంది" అని ధీమాగా చెబుతున్నది మల్లిక.

